
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - *48* -

### - తెల్ల చీకటి -

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి భారమైన శవాన్ని, భారీ చిత్ర నిర్మాతలా తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'మార్కా! మార్గమధ్యంలో నీకు అలసట అనిపించకుండా మరో కథ చెబుతాను - విను' - అని బేతాళుడు ప్రారంభించాడు.

"నయన భోగయ్య అనే తెలుగు చిత్ర ప్రేక్షకుడు రిలీజయిన రోజే ప్రతి సినిమా అతి యిష్టంతో యెప్పటి నుంచో అదే పనిగా చూస్తున్నాడు. అతనికి తెలుగు సినిమాలంటే ప్రేమ. తెలుగు చిత్రాలు వుత్తమంగా వున్నతంగా ఉచ్ఛస్థితిలో చూడాలనే తన ప్రతి వూపిరీ పీలుస్తాడు.

నయన భోగయ్యకి చిత్రవేణి అని వొకే వొక కూతురు. భార్య యేళ్ల క్రితమే అనారోగ్యంతో వెళ్లిపోయింది. తండ్రి తలపులన్నీ తనువంతా పోసుకు పెరిగిన చిత్రవేణి వయసు వయసులో వుండగా తారగా వెలగాలనుకుంది. తండ్రికి తన కోరిక చెప్పింది.

'అమ్మా! చిత్రవేణీ! ఎవరేనా వంట చేసి పెడితే తినడం యీజీ. తిని బాగుందని బాగాలేదని చెప్పడం యింకా యీజీ. ఎవరో కష్టపడి తీసిన సినిమా హాయిగా థియేటర్లో కూచుని చూసి చప్పరించడం, గొప్పరించడం ప్రేక్షకుల కున్న స్వేచ్ఛ. అలాంటి స్వేచ్ఛని కాదని కష్టాల కోసం యిష్టపడతావ్ ఎందుకమ్మా? నా మాట విని నీ ఆలోచన మానుకుని నాతో హాయిగా సినిమాలు చూడు' - అని వారించాడు. అయినా చిత్రవేణికి తన తండ్రి సలహా పాటించాలనిపించలేదు. ఒకరోజు భోగయ్యకు చెప్పకుండా యిల్లు వదిలి సినిమాదరాబాదుకి చేరుకుంది.

సినిమా ఆఫీసుల చుట్టూ తిరుగుతూ, తన ఫోటోలు చూపిస్తూ హీరోయిన్ వేషాలకోసం ప్రయత్నించసాగింది.

చిత్రవేణికి యెక్కడా హీరోయిన్ వేషాలు పుట్టడంలేదు. ఆఖరి ప్రయత్నంగా వొకరోజు నిర్మాత భజరంగ బాబుని కలిసింది. భజరంగ బాబు, చిత్రవేణిని చూసి, '-సిత్రా! నా నూ సిత్రానికి నివ్వు బాగా సూటయ్యేలాగున్నావ్. మరయితే నివ్వు బాగా ఆర్డువరకు సెయ్యాల. సీకటడే దాకా సూటింగులుంటాయ్. సీకటయ్యాగ్గాడా వుంటయ్. నివ్వన్నిటికీ యస్సంటే నీకు బాగా సహాయాలిత్తా. నా సహాయాల్తో నివ్వు నిత్తెం సూపర్ తారగా మెర్సిపోతావ్. ఏవంటావ్ మరి?' - అన్నాడు.

అప్పుడు చిత్రవేణి ' - దేశవంతా మీ బోటివారు యెందరో లేడీస్‌కి సహాయాలు అందిస్తున్నారు. అవేంటో నాకు బాగా తెలుసు. నాకు మీ సహాయాలూ వద్దు. మీ వేషమూ వొద్దు' - అని వెనక్కి తిరిగింది.

'అదేటి స్రిత్రా! అలాగనేసేవ్ - స్రిత్రంగా వుంది.' అన్నాడు భజరంగబాబు.

'అవును - మీకు చిత్రంగానే వుంటుంది. సహాయాలంటే AIDS. మీరిచ్చే AIDSతో తారని అయినా అవకపోయినా ఆకాశంలో తారల దగ్గరికి చేరడం ఖాయం. సెలవ్' అని ఆ నిర్మాతకు తన ఆఖరిమాట చెప్పి అక్కణ్ణించి బైటకొచ్చేసింది. వచ్చేసి ఆలోచించుకుంది. ఇలాంటి వాళ్లని వేషాలడిగి రిస్కు చైడం కంటే, తనే తన సొంత సినిమా నిర్మాణం చేపట్టి తన చిత్రంలో తనే హీరోయిన్ పాత్ర ధరించి తనెవరో నిరూపించుకోవాలని నిశ్చయించుకుంది. మరిప్పుడు డబ్బుకావాలి పెట్టుబడికి - ఎలా? తండ్రి గొప్ప సంపన్నుడు కాకపోయినా, డబ్బుకి లోటులేదు. ఇంటికి వెళ్లి, యింట్లోంచి వెళ్లిపోయినందుకు క్షమించమని కాళ్లమీద పడి, ప్రాధేయపడితే కాదనడు. నాన్న మనసు వెన్న. తను వొక్కగానొక్క కూతురు. తనంటే తరగని యిష్టం. ఎంతవీలైతే అంత పెట్టుబడి అడిగి లో బడ్జెట్ సినిమా తియ్యొచ్చు- అని ఆలోచించి తండ్రి నయనభోగయ్య దగ్గరికి బైల్దేరింది చిత్రవేణి.

ఇంటి దగ్గర భోగయ్యకి వయసు మీదపడి పోతోంది. అతనికో ప్రాణ స్నేహితుడున్నాడు. ఆ హితుడి పేరు ఫాలోజాన్. ఫాలోజాన్ సాయంతో భోగయ్య యింకా అదేపనిగా తెలుగు సినిమాలు వుత్తమ చిత్రాలు, చెత్తమ చిత్రాలు అన్నీ అలాగే చూస్తున్నాడు. పెరిగే వయసుతోబాటు నయనభోగయ్య కంటిచూపుకూడా మందగిస్తోంది. ఫాలోజాన్, చిత్రవేణికి బాగా తెలుసు. అతన్ని చిత్రవేణి జాన్ బాబయ్యా! అని పిలుస్తుంది. ముందుగా ఫాలో జాన్‌ని కలిసి, తన మనసులో మాట చెప్పి 'జాన్ బాబయ్యా! నాన్నని నేను అడుగుతాను. మీ మాట సాయంకూడా కావాలి' అంది చిత్రవేణి. ఆమెను పిల్లల్లేని జాన్ కూడా తన పిల్లలాగే భావిస్తాడు. 'అలాగేనమ్మా! తప్పకుండా. మీ డాడీని నేను వొప్పిస్తాను' అని హామీ యిచ్చాడు.

తండ్రిని కలిసిన కూతురితో ' - నాకు తెలుగు సినిమాలంటే ప్రాణం అని నీకూ తెలుసు. నీ మనసూ నాకు తెలుసు. నీ క్షేమంకోరి చెప్పానంతే. చెప్పకుండా వెళ్లిపోతే నువ్ చేరేదెక్కడికో నాకు తెలియదా తల్లీ -' అని పిల్లని వాటేసుకున్నాడా పితృమూర్తి. చిత్రవేణి భోరుమని ఏడ్చింది. ఫాలోజాన్ సముదాయించాడు. ముగ్గురూ మాట్లాడుకున్నారు. కొద్దిరోజుల తర్వాత, తండ్రి దగ్గర డబ్బు తీసుకుని మళ్లీ సినిమాదరాబాద్‌కి బైల్దేరింది చిత్రవేణి.

హైదరాబాద్‌లో తను తీయబోయే సినిమాకి తనే స్క్రిప్టు షాట్ డివిజన్‌తో సహా రాసుకుంది. కథలో తనుగాక మిగతా పాత్రలను బుక్ చైడం ప్రయాసగానే వుంది. వొత్తులు పలకని హీరోలు కూడా కోట్లడుగుతున్నారు. అయినా తెలుగు వొత్తులు వెలగడం మానేసి యెప్పుడో కొండెక్కిపోయాయని వారికి తెలియదు కదా పాపం. కాలం ఆగట్లేదు. ఆగితే దాన్ని ఆగిన కాలం కదా అని అనుకుంటూ ఉండిపోతారు.! చిత్రవేణి, తండ్రిని వదిలి వచ్చి అప్పుడే ఏడాది గడుస్తోంది. జాన్ బాబాయ్ వుత్తరం రాశాడు - నాన్నకి అసలు కళ్లు కనిపిచడం మానేశాయని. తన వూరు వదిలి వచ్చేముందు నాన్న అడిగాడు - 'నీ సినిమా విడుదల, ప్రీవ్యూలకి ముందు మొదటి ప్రింటు నాకు చూపిస్తావుకదూ తల్లీ -' అని. జాన్ బాబాయ్ లెటర్ చదివాక, యీ మాట గుర్తొచ్చి చిత్రవేణి కంటిరెప్పలు, గట్టున పడిన తడి ఆరని చేప పిల్లల్లా, టపటపా కొట్టుకున్నాయి. నాన్న ఆరోగ్యం యింకా క్షీణించేలోగానే, తన తొలి చిత్రం పూర్తిచేసి నాన్నకి చూపించాలి. ఆయన చూడలేకపోయినా చూపించాలి. ఎలా? ఎలా? మిగతా పాత్రలన్నీ బుక్ అయి, షూటింగంతా పూర్తవడానికి యింకా నెలలు పట్టేలా వుంది. ఆదరాబాదరాగా పాటలు రికార్డింగ్ చేయించింది. తొందరలోనే తన పద్ధతిలో చిత్రం కాపీ రెడీ చేసుకుని తన వూరికి తండ్రి దగ్గరకు బైల్దేరింది.

చిత్రవేణి, ఫాలోజాన్ సాయంతో ఒక లోకల్ థియేటర్ బుక్ చేసి ప్రొజెక్షన్ ఏర్పాట్లు చేసింది. ప్రదర్శనకు ముందు ఫాలోజాన్‌ని విడిగా కలిసి 'జాన్ బాబాయ్ నాదో రిక్వెస్టు. ప్రింటు తెచ్చాను, ప్రింటంటే కేవలం సౌండ్ ట్రాక్ - డైలాగ్స్ బి.జి.యమ్, సాంగ్స్ అన్నీ వున్నాయి. కానీ బొమ్మేలేదు. షూటింగ్ చైడం కుదరలేదు. ఈ మాట పైకి అనొద్దు. నా మీదొట్టు. నాన్నకి చూపులేదని మోసం చేస్తున్నాననుకునేవు. నిజంగా షూటింగ్ చైలేకపోయాను. నా బాధను యెలా నీతో చెప్పుకోవాలో తెలియదు.' ఆమెకు మిగతా మాటలు గొంతుకలో యిరుక్కుపోయాయి.

జాన్ బాబాయ్ ఆమె భుజం మీద చెయ్యివేసి ఏదో చెప్పబోయాడు. అతను తన మాటలు పేర్చుకునేలోపునే 'టైమవుతోంది - రండి బాబాయ్' అని చిత్రవేణి తండ్రి దగ్గరకు వెళ్లి - 'రా! నాన్నా! లోపలికి వెళ్లి కూర్చుందాం.' అని థియేటర్లోకి తీసుకు వెళ్లింది రహస్యంగా. జాన్‌తో మళ్లీ అంది 'బాబాయ్. షో అవగానే నేను అర్జంటుగా హైదరాబాద్ ట్రైన్ అందుకోవాలి. నాన్నకి తెలుసు. మీరింక వొక్క మాట కూడా నేను వెళ్లేదాకా మాట్లాడొద్దు ప్లీజ్ ఆనర్ మై రిక్వెస్ట్' - అని.

హాల్లో ముగ్గురే ప్రేక్షకులు - ప్రేక్షక చక్రవర్తి నయన భోగయ్య, ఫాలో జాన్, చిత్రవేణి ఏదో వీరక్లాస్ చిత్రం రిలీజయిన ఫస్ట్ డే లాగా.

సినిమా మొదలైంది. మాటలు, పాటలు, బ్యాగ్రౌండ్ స్కోర్ అనితరంగా వున్నాయి. కానీ తెర వెండి తెరలాగే వుంది. కళ్లు మూసుకుంటే కమనీయ చిత్రం. తెరిస్తే రేడియో మ్యూజికల్. సినిమా పూర్తయింది. హాలంతా లైట్లు వెలిగాయి.

చిత్రవేణి, తండ్రివైపు, ఫాలో జాన్ వైపు చూసింది. వారిద్దరి ముఖాలూ హాల్లో ఎక్స్‌ట్రా లైట్స్‌లా వెలిగిపోతున్నాయి. జాన్ బాబాయి చప్పట్లు కొట్టి చేతికి షేక్ హేండ్ యిస్తూ భోగయ్య ముఖంకేసి బ్లాంక్‌గా చూసాడు. నయన భోగయ్య ముఖంలో ఆనందంతోబాటు అతని కనుకొసల్లో రెండు కన్నీటి బిందువులు హాలు దీపాలకాంతిలో ముత్యాల్లా మెరిసాయి. కూతుర్ని గుండెలకు హత్తుకుని - 'మహత్తరంగా తీశావమ్మా సినిమా. ఆనాడు నిన్ను సినిమాల్లోకి వద్దన్నాను. నా పొరబాటు మర్చిపో. క్షేమంగా వెళ్లి నీ పనులు పూర్తి చేసుకుని మళ్లీ తొందర్లోనే నన్ను చూడ్డానికిరా!' అన్నాడు. చిత్రవేణి గిల్టీగా ఫీలయింది.

బైటికి వచ్చాక తండ్రికీ, జాన్ బాబాయికీ బై చెప్పి కదిలింది. కూతురి ఎక్సిట్ తర్వాత, భోగయ్య మిత్రుడు ఫాలోజాన్ భుజం మీద చెయ్యివేసి ఆసరా తీసుకుంటూ హాయిగా నవ్వి మాట్లాడాడు. "అదీ విక్రమార్కా! చిత్రవేణి నూతన చిత్రకథ. ఇప్పుడు చెప్పు నయనభోగయ్య అనే తెలుగు సినిమా ప్రేక్షక శిఖామణి హాయిగా నవ్వి, తన ప్రాణ మిత్రుడు ఫాలోజాన్‌తో ఏం మాట్లాడాడు? నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యి చెక్కలై మళ్లీ అతుక్కోలేక అవస్థ పడుతుంది -" అని బేతాళుడు ముగించాడు.

వెంటనే విక్రమార్కుడు, "ఓ బేతాళా! తన కుమార్తె సీన్లోంచి వెళ్లి పోయాక, భోగయ్య, తన మిత్రుడు జాన్‌తో 'వెర్రిపిల్ల నేనింకా చూడలేననే అనుకుంటోంది. నాకీమధ్యనే కళ్లకు ఆపరేషన్ జరిగిందనీ నేనిప్పుడూ బాగా చూడగలుగుతున్నాననీ తనకి తెలీదు. షూటింగ్ పూర్తయి అమ్మాయి సినిమా టోటల్‌గా రెడీ అయాక చెబుదాంలే. నడు" అని మాట్లాడాడు -

**తస్య సమజనయన్ హర్షం**

**కురువృద్ధః పితామహః।**

**సింహనాదం వినద్యోచ్చైః**

**శంఖం దధ్మౌప్రతాపవాన్॥**

కురువృద్ధుడైన భీష్మ పితామహుని వంటి ప్రేక్షక బ్రహ్మ - నయన భోగయ్య, భీష్ముడు తన ముఖ్య సైనికుడికి వుత్సాహమిచ్చేందుకు సింహగర్జన చేసి శంఖమూదినట్లు, తన పుత్రిక చిత్రవేణికి తెలుగుచిత్ర నిర్మాణోత్సాహం కలిగించుటకు థియేటర్లో

అట్లు ప్రవర్తించెను - అని సంజయుడు ధృతరాష్ట్రునకు చెప్పెనని చెప్పిరోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు." అని బదులు చెప్పగానే రాజుకి మౌన భంగం కలిగి బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసి, తన గుండె తనకంటే బరువెక్కేసి కొన్నాళ్ల దాకా చెట్టుమీదే సెటిలైపోదామనుకున్నాడు.

(సమాప్తం)

Post your comments